ఒకే సారి రూ.2లక్షల రుణమాఫీ చేయాలి

● కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్

సమావేశంలో మాట్లాడుతున్న పల్లె రవికుమార్

మునుగోడు, జూలై22 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులూ లేకుండా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు ఒకే సారి రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ తూతూ మంత్రంగా కొద్దిపాటి నిధులు విడుదల చేసిందన్నారు. నియోజకవర్గంలో అర్హులైన చాలా మందికి రుణమాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం ఏ ప్రాతిపాదికన మాఫీ చేసిందో రైతులకు తెలియడం లేదన్నారు. రేషన్ కార్డు ఆధారంగా కుంటుంబంలో ఒక్కరికే మాఫీ చేసినట్లు తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త నిబంధలతో అర్హులైన రైతులకు మొండి చేయి చూపిందని పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ చేసే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీకి ఉంటే షరతులు లేకుండా అర్హులైన వారందరికీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో గద్దెనెక్కేందుకు రూ.2లక్షల రుణమాఫీ ఒకే విడుతలో చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇప్పుడు మూడు విడుతల్లో చేస్తామని చెప్పడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ రూ. లక్ష రుణమాఫీ కోసం రూ.45 వేల కోట్లును వెచ్చిందని, ఇప్పుడు రూ.2లక్షల రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లు ఖర్చు అవుతాయని సీఎం చెప్పడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వానకాలం సీజన్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న రైతులకు పెట్టుబడి సాయం అందలేదన్నారు. తక్షణమే నియోజకవర్గంలోని పెడింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పొలగోని సైదులు గౌడ్, ఈద శరత్‌బాబు, మారగోని అంజయ్యగౌడ్, యడవల్లి సురేశ్, ఐతగోని విజయ్‌కుమార్, బోయపర్తి సైదులు, సుఖేందర్, పందుల సురేశ్, గంధం లింగస్వామి, బోయపల్లి దశరథ పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి : సీడీపీఓ

రామగిరి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ తూముల నిర్మల

నీలగిరి, జూలై 22 : అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా వారిని ప్రోత్సహించాలని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల ఆదేశించారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని రామగిరి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం నాగార్జునకాలనీ, యాటకన్నారెడ్డి కాలనీల్లో నిర్వహించిన అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారికి అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు బొబ్బిలి శ్రీలక్ష్మి, ఎం. మంగా, కరంటోత్ సుశీల, కె.విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

జాన్యానాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, జూన్ 22 : మండలంలోని బాణాలకుంట తండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రమావత్ హరిచంద్, బాలాజీనరగ్‌కు చెందిన బావోజీ మెగావత్ జాన్యానాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సోమవారం పరామర్శించారు. పార్టీ కోసం వారు చేసిన సేవలను కొనియాడారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వల్లపురెడ్డి, నాయకులు మాదా సుధాకర్, బొడ్డుపల్లి మహేందర్, కర్నాటి రవికుమార్, రాయిన బోయిన శ్రీను, కుంటిగొర్ల వెంకటయ్య ఉన్నారు.

పేదల పక్షాన నిలిచిన మహాకవి దాశరథి

● పెన్షనర్ల సంఘం నల్లగొండ యూనిట్ అధ్యక్షుడు గజవెల్లి సత్యం

దాశరథి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న పెన్షనర్లు, కవులు

రామగిరి, జూలై 22 : పేద ప్రజల పక్షాన నిలిచి, ఆనాటి నిజాం నిరంకుశ పాలనను తన కవిత్వం ద్వారా తీవ్రంగా ఖండించిన మహనీయుడు దాశరథి అని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నల్లగొండ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాదా వాసుదేవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాల్లో వారు పాల్గొని దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి రచయిత పున్న అంజయ్య, పెన్షనర్స్ సంఘం నాయకులు జెల్లా పుల్లయ్య, ఆంజనేయులు, రామలింగయ్య, చొల్లెటి ప్రభాకర్, కేశవాచారి, కత్తుల శంకర్ పాల్గొన్నారు.

డీవీఎం విద్య శిక్షణ కళాశాలలో...

చర్లపల్లిలోని డీవీఎం విద్యాశిక్షణ కళాశాలలో దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ పి.గంగాధర్‌రావు, ఎన్. శ్రీదేవి, బొళ్ల నారాయణరెడ్డి, బొడ్డుపల్లి రామకృష్ణ, సూపరిండెంట్ చొల్లెటి శ్రీధర్ పాల్గొన్నారు.

నల్లగొండ సిటీ : కనగల్ మండలం చిన్నమాదారం ఉన్నత పాఠశాలలో దాశరథి చిత్రపటానికి హెచ్ఎం పద్మ, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● ఎంపీడీఓ సుజాత

హాలియా, జూలై 22 : సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సుజాత సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది ప్రతిరోజు విధులకు హాజరు కావాలని, ముందస్తు అనుమతి లేకుండ గైర్హాజరు కావద్దన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాలకు ప్రతి రోజూ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చిన్నపిల్లలు, గర్భణులు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులు, లెప్రసీ బాధితులను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో మండల వైద్యాధికారి రామకృష్ణ, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

SSC MEMO పోయినది

★వాంకుడోతు సంతోష్ S/o. వాంకుడోతు శ్రీను నాయక్, మాటూరు (గా॥), త్రిపురారం(మం॥), నల్లగొండ జి॥, నివాసికి చెందిన ఒరిజినల్ SSC Memo (SI No. TS 11483679), Roll No. 2329114433) మాటూరు నుండి త్రిపురారం బైక్‌పై ప్రయాణిస్తుండగా పోయినది. దొరికిన వారు సం॥, 9966511355
Nlg

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
0% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

నల్లగొండ : 9182777626	నల్లగొండ : 9182777635	దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059	మిర్యాలగూడ : 9182777630	భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059	కోదాడ : 9182777196	తొలుపునూరి : 9182777638

బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

● ఎస్పీ శరత్‌చంద్ర పవార్

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, జూలై 22 : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరం న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశించారు. సోమవారం పోలీస్ గ్రీవెన్స్ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సుమారు 40 ఫిర్యాదులు రాగా వాటిపై సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, భూ సమస్యలకు కోర్టు ద్వారానే పరిష్కారం చూపాలని, పోలీసులు తలదూర్చితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కువగా భూ సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయని, బాధితులకు అండగా ఉండి ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించాలని సూచించారు.

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్/చిట్యాల, జూలై 22 : మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్ పట్టణం, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 67 మంది లబ్ధిదారులకు, చిట్యాల మండలానికి చెందిన 72 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సోమవారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణలక్ష్మి పథకం పేద ఆడబిడ్డలకు గొప్ప వరమన్నారు. నకిరేకల్‌లో 100 పడకల ఆస్పత్రిని త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించుకుందామన్నారు. డిగ్రీ కళాశాలను నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఎస్‌కే జమీరొద్దీన్, డీటీ యశ్వంత్, ఆర్ఐలు రాంప్రసాద్, ప్రవీణ్, కౌన్సిలర్లు గాజుల సుకన్య, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, నకిరేకంటి ఏసుపాదం, మురారిశెట్టి కృష్ణమూర్తి, చిట్యాలలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, తాసీల్దార్ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

కళాకారుడి కుటుంబానికి ఎమ్మెల్యే సామేల్ పరామర్శ

నరేశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్

శాలిగౌరారం, జూలై 22 : మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారుడు వేముల నరేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. అతడి కుటుంబ సభ్యులను సోమవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించారు. నరేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతడి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, నాయకులు అన్నెబోయిన సుధాకర్, ఇంతియాజ్, లోకసాని రంగారెడ్డి, భూపతి అంజయ్యగౌడ్, గూని వెంకటయ్య, శీలం శంకర్, పాకాల సతీశ్ ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన ఎల్లంల పద్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.60వేలు, గుండ్ల భిక్షమయ్యకు మంజూరైన రూ.17వేల చెక్కును సోమవారం ఎమ్మెల్యే మందుల సామేల్ పంపిణీ చేశారు.

గురుకులాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలి

● ఎమ్మెల్యే బీఎల్ఆర్

విద్యార్థుల భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

దామరచర్ల, జూలై 22: గురుకులాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సిబ్బందిని హెచ్చరించారు. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు పెడుతున్న భోజనాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో మౌళిక సదుపాయలు, వసతులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గురుకులాల నిర్వహణ కోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నదన్నారు. తాను మళ్లీ గురుకులాన్ని సందర్శిస్తానని, అప్పటికి కూడా పరిస్థితిలో మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈఓ బాలాజీనాయక్ ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వినతి

మిర్యాలగూడ : పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని కార్మికులు సోమవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు కరీ మున్నిసా, మంగా, సైదమ్మ, పద్మ పాల్గొన్నారు.

దేవరకొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే బాలూనాయక్


సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాలూనాయక్

చందంపేట(దేవరకొండ), జూలై 22 : దేవరకొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేం దుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. సోమవారం నిర్వహించిన దేవరకొండ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించేందుకు నిధల మంజూరుకు కృషి చేస్తానన్నారు. అధికారులు వార్డుల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, కమిషనర్ భాస్కర్‌రెడ్డి, మాజీ చైర్మన్ వడ్త్య దేవేందర్‌నాయక్, వైస్ చైర్మన్ రాహత్‌అలీ, కౌన్సిలర్లు వెంకటేశ్‌గౌడ్, జయప్రకాశ్, రయీస్, చెన్నయ్య పాల్గొన్నారు.

పీఏపల్లిలో గోదాం ప్రారంభం

పెద్దఅడిశర్లపల్లి : పీఏపల్లి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో రూ.23 లక్షలతో నిర్మించిన గోదాంను సోమవారం ఎమ్మెల్యే బాలూనాయక్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం అజ్మాపురం, నక్కల పెంటతండాలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. పీఏసీఎస్ ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాల అధికారి కిరణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ తేరా మణిపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తేరా సత్యనారాయణరెడ్డి, నాయకులు ఎల్లయ్య, కుక్కల గోవర్ధన్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, ముచ్చర్ల ఏడుకొండల్ పాల్గొన్నారు.

వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలి

ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మురుగు కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, జూలై 22 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని పలు వీధుల్లో పర్యటించారు. చుక్క వర్షం వచ్చినా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని డీపీఓను ఆదేశించారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించి పారిశుధ్యం మెరుగు పర్చాలని ఆదేశించారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీపీఓ మురళి, ఎంపీడీఓ పూజ పాల్గొన్నారు.

ప్రజాసేవలో పగడాల

● సొంత ఖర్చుతో పలువురికి ఆర్థిక సాయం
● ప్రాణమున్నంత వరకు ప్రజాసేవలో ఉంటానంటున్న సైదులు

పేద కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న సైదులు యాదవ్ (ఫైల్)

తిరుమలగిరి(సాగర్), జూలై 20 : 28 ఏండ్లుగా ప్రజా సేవ చేస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అందరి మన్ననలు పొందుతున్నారు తిరుమలగిరి (సాగర్)కు చెందిన పగడాల సైదులు యాదవ్. తాను పుట్టిన గడ్డకు మంచి చేయాలనే తపనతో అన్ని వర్గాల వారికి సేవా కార్యక్రమాలతో చేదోడువాదోడుగా ఉంటున్నారు. ఇప్పటికే మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సొంత ఖర్చుతో విద్యా సామగ్రిని అందించారు. నిరుపేద కుటుంబంలో వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి అండగా ఉంటూ దహన సంస్కారాలకు తక్షణ సాయంగా రూ.10వేలను అందిస్తున్నారు. పేదలకు పెండ్లి కానుకగా రూ.5 వేలు, సీమంతం కోసం రూ.3,500 అందిస్తున్నారు. అంతేకాకుండా మండలంలో రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించి సుమారు రూ.60 వేలు వరకు అందించారు. మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్, జ్యోతిబాపూలే విగ్రహాల ఏర్పాటుకు చేయూత నిచ్చారు. స్వామి మాల ధరించిన వారికి ఇరుముడి వస్తువులకు అందిస్తున్నాడు. గ్రామంలో ఎలాంటి కార్యక్రమం ఉన్నా, ఎవరికి ఆపద ఉన్నా తానున్నానంటూ ముందుకు వచ్చి అన్ని విధాలుగా సైదులు సహాయ, సహకారాలు అందిస్తున్నాడు. సుమారు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు సొంత ఖర్చుతో సేవా కార్యక్రమాలు చేపట్టారు. దాంతో గ్రామాల్లో సైదులుకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. సైదులును ఒక ప్రజాప్రతినిధిగా చూడాలనే కోరిక గ్రామ ప్రజలకు ఉంది.

ఆర్థికసాయం అందించిన సైదులుయాదవ్‌ను సన్మానిస్తున్న కబడ్డీ పోటీల నిర్వాహకులు

అవకాశం ఇస్తే స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తా

మండల ప్రజలకు ఏ సహాయ, సహకారాలు అందించడానికి, మండల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా. భగవంతుడు ఇచ్చిన దాంట్లో కొంత ప్రజల కోసం ఖర్చు చేయడం పుట్టిన గడ్డకు మంచి చేయాలనేదే నా లక్ష్యం. ప్రజలు అవకాశం ఇస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తా.

- పగడాల సైదులుయాదవ్

నేడు నల్లగొండలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ సిటీ, జూలై 22 : విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్న దృష్ట్యా జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఎడీఈ నవీద్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని దారుషఫాకాలనీ, భారత్‌గ్యాస్ గోడౌన్, శంస్‌నగర్, గవర్నమెంట్ ఆస్పత్రి ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని వినతి

కట్టంగూర్, జూలై 22 : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు మునుకుంట్ల గణేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తాసీల్దార్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే బీసీ డిక్లరేషన్ అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేటికీ అమలు చేయకపోవడం సిగ్గు చేట్టాన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు పబ్బు వెంకన్న, బీసీ మోర్చా మండలాధ్యక్షుడు బొడ్డుపల్లి ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

నకిరేకల్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం కోరుతూ కలెక్టర్‌కు వినతి

నకిరేకల్, జూలై 22 : నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్‌పై అవిశ్వాసం తీర్మానం పెట్టాలని కోరుతూ సోమవారం వైస్‌చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తితో పాటు 16 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, గాజుల సుకన్య, వంటిపాక సోమలక్ష్మి, పన్నాల పావని, యాసారపు లక్ష్మి, చౌగోని రజిత, దైద స్వప్న, చౌగోని రాములమ్మ, చౌగోని అఖిల, బానోతు వెంకన్న పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

మాడ్గులపల్లి, జూలై 22: మండలంలోని ఇందుగుల గ్రామానికి చెందిన పందిరి రేణుకకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.51వేల చెక్కును సోమవారం కాంగ్రెస్ నాయకులు అందించారు. కార్యక్రమంలో కల్లు శ్రీనివాస్‌రెడ్డి, బల్లె ఇంద్రారెడ్డి, మునుగోటి యాదగిరి, పందిరి దయాకర్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

చిన్నారి వైద్యం కోసం నగదును అందిస్తున్న సంస్థ బాధ్యులు

నిడమనూరు, జూలై 22 : మండలంలోని వెంగన్నగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పోతుగంటి సైదులు ఇటీవల మిర్యాలగూడ పట్టణంలో బైక్‌పై కుటుంబ సభ్యులతో కలిసి వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో అతడి కుమారుడు రూబేన్ (5) తీవ్రంగా గాయపడి నల్లగొండలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం చిన్నారి చికిత్స కోసం రూ.17 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు ముబీన్, శ్రీకాంత్, సాంబశివ, వెంకట్, శ్రీనివాస్, అన్వేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు మెమోలు

కొండమల్లేపల్లి, జూలై 22 : మండలంలోని గన్యానాయక్‌తండా గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, కొండమల్లేపల్లి పట్టణంలోని హైదరాబాద్ రోడ్డు డివైడర్ మధ్యలో పెట్టిన హరితహారం మొక్కలను పట్టించుకోక పోవడంతో ఎండిపోయాయి. ఈ విషయమై నమస్తే తెలంగాణ దిన పత్రికలో జూన్ 30న 'పచ్చదనంపై పట్టింపేది ?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన జిల్లా అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాంరెడ్డిని ఆదేశించారు. దాంతో క్షేత్ర స్థాయిలో విచారణ జరిపిన ఎంపీడీఓ గాన్యానాయక్‌తండా, కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేశారు. అయితే ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటినట్లు ఎంపీడీఓ ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

మిర్యాలగూడ డిపో మేనేజర్‌గా రామ్మోహన్‌రెడ్డి బాధ్యతలు

డీఎంగా బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్‌రెడ్డి

మిర్యాలగూడటౌన్, జూలై22: ఆర్టీసీ మిర్యాలగూడ డిపో మేనేజర్‌గా రామ్మోహన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత డీఎం పాల్ నిజామాబాద్‌కు బదిలీ కాగా జిల్లా కేంద్రం నుంచి రామ్మోహన్ రెడ్డి మిర్యాలగూడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన డీఎంకు సిబ్బంది, వివిధ కార్మిక సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామ పంచాయతీ ట్రాక్టర్ దొంగల అరెస్ట్

నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ అంతిరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 22 : మండలంలోని ఎనుగులదోరి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను ఎత్తుకెళ్లిన నిందితులను పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా చీమల కొండూరు గ్రామానికి చెందిన పల్లెర్ల మహేశ్, పల్లెర్ల కరుణాకర్, ఆత్మకూర